AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

24-9-2026 (Thursday) MAIN EDITION

షూటింగ్‌లో భారత్‌కు మరో పతకం



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్: ఆసియా క్రీడల్లో భారత ఖాతాలో మరో పతకం చేరింది. స్కీట్ షూటింగ్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, పరినాజ్ ధాలివాల్‌ల మిక్స్‌డ్ టీమ్ జోడీ కాంస్యాన్ని తమ ఖాతాలో చేర్చింది. స్కీట్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఆరు సిరీస్‌లలో భారత్ 44 పాయింట్లు సాధించగా, చైనా 52 పాయింట్లతో ప్రపంచ రికార్డును నెలకొల్పి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. 51 పాయింట్లు సాధించిన దక్షిణ కొరియా రజత పతకాన్ని గెలుచుకుంది.

రాష్ట్రంలో భూ అక్రమాలపై కమిటీ



అక్షరటుడే, వెబ్‌డెస్క్: తెలంగాణలో భూ అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఐఏఎస్ అధికారి దేవసేనను ఈ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించింది. కన్వీనర్‌గా రాజీవ్ గాంధీ హనుమంతు, సభ్యుడిగా సందీప్ కుమార్ ఝా నియమితులయ్యారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, గంగుల కమలాకర్, జగదీశ్ రెడ్డి, మాజీ మంత్రుల కుటుంబ సభ్యుల భూములపై ఈ కమిటీ విచారణ చేపట్టనుంది.

ఫ్లాట్‌గా లిస్టి.. ఐదు శాతం ఎగబాకిన ఎన్ఎస్ఈ షేర్లు



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ షేర్లు గురువారం బీఎస్ఈలో లిస్టయ్యాయి. కంపెనీ ఒక్కో షేరును రూ. 1,785 కి విక్రయించగా.. 0.84శాతం ప్రీమియంతో కేవలం రూ.15 లాభంతో రూ.1800 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. మార్కెట్‌లో అరంగేట్రం చేసిన కొద్దిసేపటికే ఎన్ఎస్ఈ షేర్లు 5 శాతం వరకు లాభపడి ఇంట్రాడే గరిష్ట స్థాయి అయిన రూ. 1,878కి చేరుకున్నాయి.

కాకుమాను రాజశేఖర్ మృతి



అక్షరటుడే, ఏపీ : వఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ కాకుమాను రాజశేఖర్ గురువారం ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసంలో గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హాస్పిటళ్లలో ఫైర్ సేఫ్టీపై సమీక్ష



అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాల అమలుపై అధికారులతో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం సమీక్షించారు. ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీకి ప్రాధాన్యత ఇస్తున్నామని అధికారులు తెలిపారు.

సుప్రీంలో దానంకు షాక్



దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. పార్టీ ఫిరాయించిన ఆయనపై హైకోర్టు వేసిన అనర్హతన వేటును సమర్థించింది. దానం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. మళ్లీ ఎన్నికలకు వెళ్లాలనని ఆయన న్యాయస్థానం సూచించింది. దీంతో ఖైరతాబాద్‌లో త్వరలో ఉప ఎన్నికలు రానున్నాయి.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ హైకోర్టు తీర్పును సమర్థించిన న్యాయస్థానం ■ దానం నాగేందర్ పిటిషన్ కొట్టివేత ■ ఎన్నికలకు వెళ్లాలని సూచన

దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. హైకోర్టు తీర్పును చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సమర్థించింది. దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. దానంపై హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. ఆయన పార్టీ మారినట్లు ఆధారాలు ఉన్నాయని న్యాయస్థానం, స్పీకర్ తీర్పును కొట్టివేసింది. దానంపై వేటు వేయడంతో పాటు ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంది. ఈ తీర్పుపై దానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం ఆయనకు షాక్ ఇచ్చింది. దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది.

కోర్టు కీలక వ్యాఖ్యలు

దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆయన పార్టీ మారారు. అంతేగాకుండా కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. దీంతో బీఆర్ఎస్ , బీజేపీ ఆయనపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరాయి. అయితే పార్టీ మారినట్లు ఆధారాలు లేవని అనర్హత వేయకుండా స్పీకర్ పిటిషన్‌ను కొట్టివేశారు. దీనిపై బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించడంతో స్పీకర్ నిర్ణయాన్ని పక్కన పెట్టిన ధర్మాసనం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసింది. దీనిని సవాల్ చేస్తూ దానం సుప్రీం కోర్టుకు వెళ్లగా అక్కడ కూడా చుక్కెదురైంది. ఈ సందర్భంగా జస్టిస్ బాగ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్‌కు ఎమ్మెల్యేగా ఫిక్స్‌డ్ డిపాజిట్ ఉండేదని, ఎంపీగా షేర్ మార్కెట్‌లో అదృష్టాన్ని పరీక్షించుకున్నారన్నారు. ఇప్పుడు ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్ కూడా పోయిందని పేర్కొన్నారు.

ఎన్నికలకు వెళ్లండి

అనర్హత వేటు పడిందని, మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టు సూచించింది. దీంతో ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయింది. నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా అసెంబ్లీకి ఎన్నికైనప్పటికీ, 2024 సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో 2024 ఏప్రిల్ 23 నుండి ఆయన అనర్హుడని హైకోర్టు ప్రకటించింది.

భారత నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకం: మోదీ



అక్షరటుడే, ఢిల్లీ: రాజకీయాలు, ఎన్నికల ప్రక్రియలు వాటి దారిన అవి సాగుతుంటాయని, కానీ దేశాభివృద్ధే తమకు అత్యున్నత ప్రాధాన్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 'సేవా యాత్ర'లో పాల్గొంటున్న ప్రతినిధులతో ఆయన వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ముచ్చటించారు. భవిష్యత్ భారత నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని ప్రధాని మోడీ ప్రత్యేకంగా నొక్కిచెప్పారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) లక్ష్యాన్ని సాకారం చేయడంలో నేటి యువతరమే అసలైన సృష్టికర్తలని కొనియాడారు.

మెట్రో వేళలు పొడిగింపు..



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జన వేడుకలను పురస్కరించుకుని మెట్రో రైలు సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల సౌకర్యార్థం మెట్రో రైలు సేవలను సెప్టెంబర్ 25న రాత్రి, 26వ తేదీ తెల్లవారుజామున 1:00 గంట వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో నిమజ్జన శోభాయాత్రకు వెళ్లే నగరవాసులు రాత్రివేళ కూడా మెట్రో ప్రయాణ సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవచ్చు.

థర్మల్ పవర్ ప్లాంట్‌ల వద్ద ఉద్రిక్తత



అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల సందర్శనకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. పవర్ ప్లాంట్‌ల వద్దకు వెళ్లిన గులాబీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గురువారం భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సందర్శనకు వెళ్లిన బీఆర్ఎస్ బృందాన్ని పోలీసులు ఆపారు. దీంతో పవర్ ప్లాంట్ ఎదుట మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఇతర బీఆర్ఎస్ నాయకులు ఆందోళ చేశారు. యాదాద్రి పవర్ ప్లాంట్ వద్దకు వెళ్లిన మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుల బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

బస్సు ప్రమాదం.. 9 మంది సజీవ దహనం



అక్షరటుడే, యూపీ : ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం అర్ధరాత్రి ఓ స్లిపర్ బస్సులో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 9 మంది సజీవ దహనం అయ్యారు. ఏసీ బస్సు నోయిడా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మహోబాకు వెళ్తుండగా అర్ధరాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏసీ పేలడంతో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఇంజిన్ లూబ్రికేటింగ్ ఆయిల్‌కు అంటుకొని వేగంగా వ్యాపించాయి. దీంతో బస్సు కాలిబూడిద అయింది. ఆ సమయంలో ప్రయాణికులు నిద్రలో ఉన్నారు. దీంతో 9 మంది సజీవ దహనం అయ్యారు.



బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక విషయాలు

అక్షరటుడే, సికింద్రాబాద్: హైదరాబాద్‌లోని బొల్లారం మద్రాసు రెజిమెంట్ నుంచి ఆయుధాలు చోరీకి గురైన కేసులో మరో బిగ్ ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో అరెస్టయిన మాజీ హవాల్దార్ మల్లేష్‌కు గతంలో నేరచరిత్ర ఉన్నట్లు మల్కాజ్‌గిరి పోలీసుల కస్టడీ విచారణలో తేలింది. 2005 నుంచి 2007 మధ్య కాలంలో అచ్చంపేట, అమ్రాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మల్లేష్‌పై ఇళ్లలో చోరీలు (హౌజ్ బ్రేకింగ్) కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆ కేసులు కోర్టులో వీగిపోవడంతో అతను నిర్దోషిగా బయటపడినట్లు తేలింది.

వుషులో భారత్‌కు రజతం

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా గేమ్స్‌లో వుషు మహిళల 60 కేజీల విభాగంలో నవోరెమ్ రోషిబినా దేవి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. రోషిబినా దేవి ఆసియా క్రీడలకు అనుకోకుండా ఎంపికైంది. అనంతరం క్రీడల్లో సత్తా చాటి ఏకంగా సిల్వర్ మెడల్ సాధించింది. దీంతో ఆమె వరుసగా మూడో ఆసియా గేమ్స్‌లో మెడల్ సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది. ఫైనల్‌లో ఆమె 02 తేడాతో ఓడిపోయారు. ఆమె 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం, 2022లో రజతం గెలుచుకుంది. రోయింగ్‌లో పురుషుల డబుల్స్ భారత టీమ్ కాంస్యం పతకం సాధించింది. సత్నామ్ సింగ్, సల్మాన్ ఖాన్ కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు.





రోడ్డు ప్రమాదంలో మంత్రి కూతురు మృతి

అక్షరటుడే, జార్ఖండ్: జార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న ట్రక్కును వేగంగా వచ్చిన కారు ఢీకొంది. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో మంత్రి కూతురితో సహా నలుగురు మృతి చెందారు. జంషెడ్‌పూర్‌లో గురువారం తెల్లవారుజామున ఉన్న ట్రక్కును కారు ఢీకొంది. ప్రమాదంలో జార్ఖండ్ మంత్రి దీపికా పాండే సింగ్ కుమార్తె త్రిషతో సహా నలుగురు చనిపోయారు. మృతుల్లో సార్థక్ అగర్వాల్, నమన్ గుప్తా, వంశిక ఖండేల్‌వాల్ ఉన్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో కారులోని నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. కారు సైతం నుజ్జునుజ్జు అయింది. ట్రక్కు చెడిపోవడంతో హైవేపై డివైడర్‌కు ఆనుకుని కుడివైపున నిలిపి ఉంచారు.

ట్రావెల్స్ బస్సులో అగ్ని ప్రమాదం

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్‌లోని మీర్‌పేట్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నాగోల్‌లోని శ్రీ మహాలక్ష్మి రియల్ ఎస్టేట్‌కు చెందిన సుమారు 150 మంది 3 బస్సుల్లో శ్రీశైలం బయలుదేరారు. సుమారు 2 గంటల ప్రాంతంలో గాయత్రీ నగర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో పార్క్ చేసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ ట్రావెల్స్ బస్సు మంటల్లో చిక్కుకుంది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే ప్రయాణికులను కిందకు దిగిపోవాలని సూచించాడు. అందరూ సురక్షితంగా కిందకు దిగడంతో ప్రమాదం తప్పింది. అయితే బస్సు పూర్తిగా కాలిపోయింది.

